GV MALL shop & celebrate TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA



# ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం


స్మార్ట్ ఎడిషన్ Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 106 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 +https:www.prajarepublic.com + వెల - 1/- బుధవారం 20 నవంబర్ 2024

RNI No: APTEL/2023/87888 Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# ఒక్కో ఇటుకా పేరుస్తూ ముందుకెళ్తున్నాం :సీఎం చంద్రబాబు

● గతంలో ఎన్నడూ లేనివిధంగా 2024 ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారని సీఎం చంద్రబాబు అన్నారు.



**అమరావతి, నవంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్):** గతంలో ఎన్నడూ లేనివిధంగా 2024 ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారని సీఎం చంద్రబాబు అన్నారు. 150 రోజుల్లో తమ ప్రభుత్వం చేపట్టిన పనులను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత తనపై ఉందని చెప్పారు. వైకాపా పాలనలో జరిగిన అక్రమాలపై ఎంత తవ్వితే అంత భయంకరమైన విషయాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. ఒక్కో ఇటుకా పేరుస్తూ ముందుకెళ్తున్నామని చెప్పారు. శాసనసభలో సీఎం మాట్లాడారు. "నాలుగు దశాబ్దాలుగా ప్రజలు నన్ను ఆదరించారు. వారికి జీవితాంతం రుణపడి ఉంటాను.

ప్రజల కోసం నిరంతరం అధ్యయనం చేస్తూ నిత్య విద్యార్థిలా నేర్చుకున్నాను. ఎన్నో కష్టాలు చూశా.. అవమానాలు ఎదుర్కొన్నా. 24 క్లైమోర్మైన్స్‌తో దాడి చేస్తే వేంకటేశ్వరస్వామి పునర్జన్మ ప్రసాదించి ప్రాణభిక్ష పెట్టారు. ఈ సభలోనే నా కుటుంబసభ్యులను అవనమానపరిచేలా మాట్లాడారు. ఆ సమయంలో తీవ్ర ఆవేదన కలిగింది. వేధింపులకు గురిచేసి చివరికి జైలుకు పంపించారు. నేను ఏ తప్పూ చేయలేదు.. చేయను. అనుక్షణం ప్రజల కోసమే పనిచేస్తా. అలాంటి ఇబ్బందులు పెట్టినప్పుడు ఇంకా మనోధైర్యంతో ముందుకెళ్లాను. చాలా అరుదైన సంఘటనలు నా జీవితంలో చూశాను. 53 రోజులు జైల్లో ఉన్నప్పుడు ప్రపంచదేశాల్లోని తెలుగువారు రోడ్డు పైకి వచ్చి పోరాడారు. ప్రజలు ఇచ్చిన స్థానాన్ని ఎవరు చెరపాలన్నా చెరగదు. నాలుగోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టాను. ఇది అరుదైన అనుభవం. నాపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించారు. అధికారం, సీఎం కుర్చీ, కేంద్ర రాజకీయాలు కూడా కొత్త కాదు. ప్రాంతీయ పార్టీగా తెదేపా కేంద్రంలో ఎన్నోసార్లు కీలకపాత్ర పోషించింది. విధ్వంసమైన వ్యవస్థలు, గాడితప్పిన యంత్రాంగం, గత ప్రభుత్వ అప్పులు, తప్పులు ఈ ప్రభుత్వానికి సవాలుగా మారాయి. ఈ రాష్ట్రాన్ని బాగు చేయగలమనే నమ్మకముందా? అని కొందరు అడిగారు. నేను పారిపోను.. అధికారం ఉన్నా, లేకున్నా ప్రజల కోసమే పనిచేశా. ఇప్పుడు కూడా అలాంటి సవాళ్ళు స్వీకరించి మళ్లీ ప్రజలను నిలబెడతానని చెప్పాను. అది చేసి తీరతానని ముందుకొచ్చాను. 21 మంది ఎంపీలతో దిల్లీలో మన పరపతి పెరిగింది. ఒక్కో ఇటుకా పేరుస్తూ ముందుకెళు_న్నాం. రాత్రికి రాత్రే ఏదీ సాధ్యం కాదు. ఈ విషయాన్ని ఎమ్మెల్యేలు ప్రజలకు తెలియజేయాలి. అంకితభావంతో పనిచేస్తూ రాజీ లేకుండా ముందుకెళ్తాం.

### ఆడబిడ్డల జోలికొస్తే ఖబడ్దార్

వైకాపా ప్రభుత్వం శాంతిభద్రతలను గాలికొదిలేసిందని సీఎం చంద్రబాబు విమర్శించారు. శాసనసభ సమావేశాల్లో ఆయన ప్రసంగించారు. "గత ప్రభుత్వ హయాంలో పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేశారు. రాజకీయ నాయకులను నిర్వీర్యం చేయాలనే ప్రయత్నం చేశారు. ఆడబిడ్డల జోలికొస్తే ఖబడ్దార్.. ఊరుకునేది లేదు. కఠిన చర్యలు తీసుకుంటాం. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పెద్దఎత్తున ర్యాలీ చేపడతాం. పిల్లలకు కూడా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఎవరైనా భూకబ్జాలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నా" అని చంద్రబాబు చెప్పారు.



# 'మహా' ఎన్నికలు.. ఓటేసిన ప్రముఖులు

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తొలి గంటల్లో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**ముంబయి, రాంఛీ, నవంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్):** మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ బుధవారం కొనసాగుతోంది. మహారాష్ట్రలో ఒకే విడతలో మొత్తం 288 నియోజకవర్గాలకు ఓటింగ్ జరుగుతుండగా.. ఝార్ఖండ్‌లో రెండోవిడతలో 38 నియోజకవర్గాలకు పోలింగ్ నిర్వహిస్తున్నారు. దీంతో పాటు పలు రాష్ట్రాల్లోని కొన్ని అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో ఓటుహక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. మహారాష్ట్ర ఎన్నికల్లో తొలి గంటల్లో పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

- బారామతిలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ అభ్యర్థి అజిత్ పవార్ ఓటు వేశారు. రాష్ట్రంలో మరోసారి మహాయుతి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. ముంబయిలోని రాజ్భవన్లో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- నాగ్పూరలోని ఓ పోలింగ్ కేంద్రంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ ఓటు వేశారు.
- ముంబయిలోని పలు పోలింగ్ కేంద్రాల్లో బాలీవుడ్ దర్శకుడు కబీర్ ఖాన్, సినీ నటుడు రాజ్ కుమార్ రావ్, నటి గౌతమీ కపూర్, నటులు అక్షయ్ కుమార్, అలీ ఫజల్ ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తొలి గంటల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- బారామతిలోని పోలింగ్ కేంద్రంలో ఎన్సీపీ (ఎస్పీ) నాయకురాలు, ఎంపీ సుప్రియా సూలే తన కుటుంబంతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్, తన భార్య అంజలి, కుమార్తె సారాతో కలిసి ముంబయి పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.

## కడప స్టీల్ ప్లాంట్ కోసం

# ఎంపీ అవినాష్ ఏం చేశారు?: షర్మిలా

పదేళ్లు స్థానిక ఎంపీగా ఉన్న అవినాష్ రెడ్డి.. కడప స్టీల్ ప్లాంట్ కోసం ఏం చేశారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు.



**కడప, నవంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్):** పదేళ్లు స్థానిక ఎంపీగా ఉన్న అవినాష్ రెడ్డి.. కడప స్టీల్ ప్లాంట్ కోసం ఏం చేశారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. ప్రజలు ఇలాంటి నాయకులను ఎన్నుకునే ముందు ఆలోచించుకోవాలని వ్యాఖ్యానించారు. కడపలో నిర్వహించిన మీడియా సమావేశంలో షర్మిల మాట్లాడారు. గత ఐదేళ్లలో స్టీల్ప్లాంట్ కోసం జగన్ చేసిందేమీ లేదన్నారు. కేవలం టెంకాయలు కొట్టే ఫ్యాక్టరీగానే గత పాలకులు తయారు చేశారన్నారు. మీడియా ఎదుట షర్మిల టెంకాయలు కొట్టి నిరసన తెలిపారు. "కడప స్టీల్ప్లాంట్ శంకుస్థాపనలకే పరిమితమైంది. చెల్లి పెళ్లి చేయాలి మళ్లీ మళ్లీ అన్నట్లుగా తయారైంది. పేద ప్రజల కోసం, కడప ప్రాంత అభివృద్ధి కోసం వైఎస్సార్ చిత్తశుద్ధితో దీన్ని తీసుకొచ్చారు. 10వేల ఎకరాల్లో రూ.20వేల కోట్ల పెట్టుబడితో 20 మిలియన్ల టన్నుల సామర్థ్యంతో స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలన్నది ఆయన ఆశయం. దీని ద్వారా 25వేల మందికి ప్రత్యక్షంగా, లక్ష మందికి పరోక్షంగా ఉద్యోగాలు కల్పించేందుకు అవకాశముంది. వైఎస్సార్ చనిపోయిన తర్వాత వచ్చిన నాయకులందరూ స్టీల్ ప్లాంట్ ఊసే లేకుండా చేశారు. సెయిల్ ద్వారానే ప్లాంట్ నిర్మించాలని విభజన హామీల్లో ఉంది. 2014లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఉంటే నిర్మాణం జరిగి ఉండేది. ఏపీ పట్ల భాజపాకు చిన్నచూపు ఉంది. ప్రత్యేక హోదాతో పాటు మిగిలిన హామీలను సైతం ఆ పార్టీ తుంగలో తొక్కింది.

### జగన్ ఆస్కార్ డైలాగులు చెప్పారు

2019లో అధికారంలోకి వచ్చిన జగన్ కూడా స్టీల్ ప్లాంట్ నిర్మాణాన్ని విస్మరించారు. మూడేళ్లలో నిర్మాణం చేపట్టి తన చిత్తశుద్ధిని నిరూపించుకుంటానని జగన్ నాడు ఆస్కార్ డైలాగులు చెప్పారు. అధికారం, ప్రాంతాలు, కంపెనీలు మారుతున్నా స్టీల్ ప్లాంట్ నిర్మాణం మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంది. పదేళ్లు ఎంపీగా ఉన్న వైఎస్ అవినాష్ రెడ్డి కడప స్టీల్ ప్లాంట్ కోసం పార్లమెంటులో ఏం చేశారో సమాధానం చెప్పాలి. ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు అసెంబ్లీకి వెళ్లని జగన్కు ఎమ్మెల్యే పదవి ఎందుకో? ప్రతిపక్ష హోదాకు అవసరమైన ఎమ్మెల్యేలని గెలిపించుకోలేని ఆయన.. ప్రతిపక్ష హోదా కావాలని అడగటం సిగ్గుచేటు. కడప ప్రాంత అభివృద్ధికి స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టకపోతే కాంగ్రెస్ పార్టీ ఉద్యమబాట పడుతుంది. అవసరమైతే నిరవధిక నిరాహార దీక్షకూ సిద్ధం" అని షర్మిల అన్నారు.

# సంపూర్ణ అభివృద్ధి దిశగా ఏపీ..

## :డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

తెలుగువారు ప్రపంచవ్యాప్తంగా ఉండటానికి సీఎం చంద్రబాబు ముఖ్య కారణమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు.



**అమరావతి, నవంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్):** తెలుగువారు ప్రపంచవ్యాప్తంగా ఉండటానికి సీఎం చంద్రబాబు ముఖ్య కారణమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. శాసనసభ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. "అక్రమ కేసులతో జైలులో పెట్టి చంద్రబాబును ఇబ్బంది పెట్టారు. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేసింది. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని వైకాపా ప్రభుత్వం వెనక్కి తీసుకెళ్లింది. వాళ్ల వరుస దోపిడీలు, అరాచకాలను చూసే ప్రజలు మనకు మద్దతు పలికారు. రాష్ట్ర భవిష్యత్తు పట్ల విశ్వాసాన్ని తీసుకొచ్చిన చంద్రబాబుకు ధన్యవాదాలు. 150 రోజుల కూటమి ప్రభుత్వ పాలనతో సంతృప్తి చెందాం. ఏపీ సంపూర్ణ అభివృద్ధి దిశగా వెళ్తుందని మనస్ఫూర్తిగా విశ్వసిస్తున్నా" అని పవన్ కల్యాణ్ తెలిపారు.

# ప్రజలనే కాదు.. వేములవాడ రాజన్ననూ కేసీఆర్ మోసం చేశారు: సీఎం రేవంత్

ప్రజలనే కాదు.. వేములవాడ రాజన్ననూ కేసీఆర్ మోసం చేశారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు.



**వేములవాడ, నవంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్):** ప్రజలనే కాదు.. వేములవాడ రాజన్ననూ కేసీఆర్ మోసం చేశారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ను గద్దె దించాలని సిరిసిల్ల పాదయాత్రలో నిర్ణయించుకున్నానని తెలిపారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా వేములవాడ గుడిచెరువులో ఏర్పాటు చేసిన బహిరంగసభలో సీఎం మాట్లాడారు. మిడ్మానేరు నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో వాయిదా పడుతూ వస్తున్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. ఈ నెల 30న మరోసారి ఉత్తమ్కుమార్రెడ్డి ఇక్కడికి వచ్చి ప్రాజెక్టులపై సమీక్షిస్తారని సీఎం చెప్పారు.

2

## దిల్లీ కాలుష్యం ఎఫెక్ట్..

# 50 శాతం ప్రభుత్వ ఉద్యోగులకు వర్క్ హోమ్

కాలుష్య తీవ్రత పెరిగిన నేపథ్యంలో 50 శాతం ప్రభుత్వ ఉద్యోగులు ఇంటి నుంచే పని చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు పర్యావరణ శాఖ మంత్రి గోపాల్ రాయ్ పేర్కొన్నారు.



**దిల్లీ, నవంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్):** దేశ రాజధాని నగరం ఢిల్లీలో గాలి నాణ్యత రోజురోజుకీ క్షీణిస్తోంది. గాలి నాణ్యతా సూచీ 400లకు పైగా నమోదవుతోంది. ఈనేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 50 శాతం ప్రభుత్వ ఉద్యోగులు ఇంటినుంచే పని చేయాలని ఆదేశించింది. కాలుష్య తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని పర్యావరణ శాఖ మంత్రి గోపాల్ రాయ్ ప్రకటించారు. దేశ రాజధానిలో పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించడానికి దిల్లీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇందులోభాగంగా 50 శాతం ప్రభుత్వ ఉద్యోగులు ఇంటినుంచే పని చేయాలని ఆదేశించింది. దీని అమలుకోసం నేడు(బుధవారం) సచివాలయ అధికారులతో సమావేశం నిర్వహించనున్నాం" అని దిల్లీ పర్యావరణశాఖ మంత్రి గోపాల్రాయ్ సోషల్ మీడియా ఎక్స్లో పోస్ట్ చేశారు. ఢిల్లీలోని మున్సిపాలిటీ పరిధిలోని కార్యాలయాలు ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, మిగిలిన ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు ఉదయం 10 నుంచి సాయంత్రం 6.30 వరకు పనిచేస్తాయని పేర్కొన్నారు. ఇప్పటికే ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఆన్లైన్ తరగతులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దిల్లీలో వాయుకాలుష్యం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో అక్కడి ప్రజలు తీవ్రమైన కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నారు. ఈ ఉదయం గాలి నాణ్యత సూచీ 422గా నమోదైంది. చాలా ప్రాంతాల్లో ఇది 500 మార్కు దాటడంతో వాతావరణ శాఖ అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దీనివల్ల ఇప్పటికే పలు విమానాలు, రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాలుష్యం నేపథ్యంలో సుప్రీంకోర్టులోని ఏ కేసులైనా సరే లాయర్లు వర్చువల్ మోడ్లో పాల్గొని తమ వాదనలు వినిపించొచ్చని సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా పేర్కొన్నారు. వాయు కాలుష్యాన్ని ఎదుర్కొనేందుకు కృత్రిమ వర్షం కురిపించేలా చర్యలు తీసుకోవాలని దిల్లీ పర్యావరణ శాఖ మంత్రి గోపాల్ రాయ్ తాజాగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## ఫార్మా కంపెనీలో ప్రమాదం..

# ఒకరి మృతి, ముగ్గురికి తీవ్రగాయాలు

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సూరారంలోని అరోరా ఫార్మా కంపెనీలో ప్రమాదం జరిగి కార్మికుడు అనిల్ (43) మృతి చెందారు.





**జీడిమెట్ల, నవంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని అరోరా ఫార్మా కంపెనీ రియాక్టర్లో ర-సాయన ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కార్మికుడు అనిల్(40) మృతి చెందారు. మరో ముగ్గురు కార్మికులు గోపి(23), శ్రీనివాస్(25), బలరామ్(30)నకు తీవ్ర గాయాలయ్యాయి. బాయిలర్ శుభ్రం చేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. గాయపడిన కార్మికులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం ఉదయం జరిగితే.. మృతుడి, బాధితుల కుటుంబాలకు సంస్థ నిర్వాహకులు సమాచారం ఇవ్వలేదు. సంస్థ ముందు మృతుడి బంధువులు నిరసన వ్యక్తం చేశారు. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని వారు ఆరోపించారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.


printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# ప్రజలనే కాదు.. వేములవాడ రాజన్ననూ కేసీఆర్ మోసం చేశారు: సీఎం రేవంత్

ప్రజలనే కాదు.. వేములవాడ రాజన్ననూ కేసీఆర్ మోసం చేశారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు.



వేములవాడ, నవంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్): ప్రజలనే కాదు.. వేములవాడ రాజన్ననూ కేసీఆర్ మోసం చేశారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ను గద్దె దించాలని సిరిసిల్ల పాదయాత్రలో నిర్ణయించుకున్నానని తెలిపారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా వేములవాడ గుడిచెరువులో ఏర్పాటు చేసిన బహిరంగసభలో సీఎం మాట్లాడారు. మిడ్మానేరు నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో వాయిదా పడుతూ వస్తున్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. ఈ నెల 30న మరోసారి ఉత్తమ్కుమార్రెడ్డి ఇక్కడికి వచ్చి ప్రాజెక్టులపై సమీక్షిస్తారని సీఎం చెప్పారు. "దేశానికి ప్రధానిని అందించిన గడ్డ కరీంనగర్. పరిపాలన ఎలా ఉంటుందో దేశానికి చూపిన తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు. తెలంగాణ ఇస్తామని సోనియాగాంధీ ఇక్కడి నుంచే ప్రకటన చేశారు. తెలంగాణ బిల్లును ఆమోదింపజేయడంలో కరీంనగర్ బిడ్డ, జైపాల్రెడ్డి కీలక పాత్ర పోషించారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే ఎంత దూరమైనా వెళ్తుంది. పొన్నం ప్రభాకర్ను ఎంపీగా గెలిపిస్తే తెలంగాణ రాష్ట్రం సాధించారు. బండి సంజయ్ను రెండు సార్లు పార్లమెంట్కు పంపిస్తే కేంద్ర మంత్రి అయ్యారు కానీ, కరీంనగర్ జిల్లాకు కేంద్రం నుంచి చిల్లి గవ్వ అయినా తెచ్చారా? కరీంనగర్ అభివృద్ధి కోసం ఎప్పుడైనా పార్లమెంట్లో మాట్లాడారా? అంతకు ముందు 3 సార్లు భారాస ఎంపీలను గెలిపిస్తే వాళ్లు కూడా కరీంనగర్కు చేసిందేమీ లేదు.

## 50వేల ఉద్యోగాలకు ఒక్కటి తగ్గినా క్షమాపణ చెబుతా..

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలోని ఏ రాష్ట్రం కూడా అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే 50వేల ఉద్యోగాలు ఇవ్వలేదు. 50వేల ఉద్యోగాలకు ఒక్కటి తగ్గినా ఎల్బీ స్టేడియం వేదికగా క్షమాపణ చెబుతా. రూ.11వేల కోట్ల రుణమాఫీకి కేసీఆర్ ఐదేళ్లు తీసుకున్నారు. 25 రోజుల్లో 23 లక్షల కుటుంబాలకు రూ.18వేల కోట్ల రుణమాఫీ చేశాం. రుణమాఫీని అభినందించాల్సింది పోయి విమర్శిస్తారా? మీరు చేసిన రుణమాఫీ.. మేము చేసిన రుణమాఫీ వివరాలు బయటకు తీసి చర్చకు పెడదాం. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే రుణమాఫీ లెక్కలు తీసి చూపిస్తాం. పదేళ్లలో మీరు చేయలేని పని మేం చేస్తుంటే మీకు నొప్పి ఎందుకు? మీ నొప్పికి మా కార్యకర్తల దగ్గర మందు ఉంది.. త్వరలోనే పెడతారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ సంగతి తేలుస్తాం.

## కేసీఆర్.. ఒక్కసారి అసెంబ్లీకి రా.. సామి

పరిశ్రమలు వస్తే మా పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని భూ సేకరణ చేస్తున్నాం. భూసేకరణకు అధికారులు వస్తే దాడి చేస్తారా? భూ సేకరణ చేయడం కేసీఆర్కు ఇష్టం లేదా? పరిశ్రమలు తెచ్చి మన పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వకూడదా? భారాస అధికారంలో ఉన్నప్పుడు భూములు సేకరించలేదా? అభివృద్ధి జరగాలంటే భూ సేకరణ జరగాల్సిందే. అభివృద్ధి కోసం ఎవరో ఒకరు భూమి కోల్పోవాల్సిందే. భూమి కోల్పోతున్న వారికి మూడు రెట్లు పరిహారం ఇవ్వాలని నిర్ణయించాం. చివరిగా చంద్రశేఖర్రావుకి ఒకటే చెబుతున్నా.. అసెంబ్లీకి రా.. సామి. 80వేల పుస్తకాలు ఏం చదివినవో మాట్లాడుదాం. ఒక్కసారి రా.. సామి.. వస్తే రోజంతా చర్చ చేద్దాం. అన్ని లెక్కలు తేలుద్దాం" అని సీఎం అన్నారు.

## భూ బదలాయింపులపై హరీశ్రావు లెక్క చెప్పాలి

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే భారాస నేతలు తట్టుకోలేకపోతున్నారు. ఈ ఏడాది తెలంగాణలో కోటి 53 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు పండించారు.. అది మా గొప్పతనం కాదా? రూ.1.83 లక్షల కోట్లు ప్రజాధనాన్ని ప్రాజెక్టుల కోసం కేసీఆర్ ఖర్చు పెట్టారు. రంగనాయకసాగర్ వద్ద హరీశ్ రావు ఫామ్ హౌస్ కట్టుకున్నారు. భూ సేకరణ కోసం తీసుకున్న భూమిని హరీశ్రావు పేరు మీదకు రాయించుకున్నారు. భూ బదలాయింపులపై హరీశ్రవు లెక్క చెప్పాలి.. అన్ని లెక్కలు తీయిస్తున్నాం. కొండపోచమ్మ నుంచి కేసీఆర్ ఫామ్ హౌస్కు కాల్వ ద్వారా నేరుగా నీళ్లు వెళ్తున్నాయి. ప్రజలు అధికారం ఇస్తే ఇదేనా మీరు చేసింది? డ్రగ్స్ తీసుకున్న వారు ఇంట్లో దొరికితే కేసు పెట్టకూడదా? బావ తాగి తందనాలు ఆడితే.. కేటీఆర్ ఎలా సమర్థిస్తారు? విదేశీ మద్యంతో దొరికితే కేసు పెట్టకూడదా? చట్టం అందరికీ సమానమే కేటీఆర్. కేటీఆర్ ఉరుకులాటలు గమనిస్తూనే ఉన్నా.. ఎంత దూరం ఉరుకుతారో నేనూ చూస్తా. భూ సేకరణపై కుట్ర చేసినందుకు కేటీఆర్ ఊచలు లెక్కపెడతారు. నా నియోజకవర్గంపై కేసీఆర్కు ఎందుకంత కక్ష? నేనేమీ లక్ష ఎకరాలు సేకరించలేదు. సేకరిస్తానన్నది 4 గ్రామాల్లో 1100 ఎకరాలు.



# గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే బుడమేరుకు వరదలు: మంత్రి నిమ్మల

ఏపీలో గత ప్రభుత్వ పాపం, నిర్లక్ష్యం కారణంగానే బుడమేరుకు వరదలొచ్చాయని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తంచేశారు.



అమరావతి, నవంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్): ఏపీలో గత ప్రభుత్వ పాపం, నిర్లక్ష్యం కారణంగానే బుడమేరుకు వరదలొచ్చాయని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తంచేశారు. విజయవాడలో బుడమేరు వాగుకు వచ్చిన వరదలపై శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు. బుడమేరు డైవర్షన్ కెనాల్ పూర్తిచేయడంలో వైకాపా ప్రభుత్వం విఫలమైందని మంత్రి నిమ్మల తెలిపారు. గత ఐదేళ్లలో బుడమేరు డైవర్షన్ కెనాల్ పనుల పూర్తికి ఎలాంటి చర్యలు చేపట్టలేదని మండిపడ్డారు. ఒకేసారి 15 వేల క్యూసెక్కుల నీరు రావడంతో గండ్లు పడి వరదలు వచ్చాయని చెప్పారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే బుడమేరుకు వరదలొచ్చాయని, భవిష్యత్తులో వరదలు రాకుండా ఆపరేషన్ బుడమేరు చేపడతామని మంత్రి నిమ్మల పేర్కొన్నారు. అదేవిధంగా గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టామని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. 2027 గోదావరి పుష్కరాల నేపథ్యంలో పురపాలక శాఖ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు ఘాట్ల నిర్మాణాన్ని జలవనరుల శాఖ తీసుకుంటుందని ఆయన తెలిపారు. అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పుష్కరాలకు ఏర్పాట్లు చేస్తామని వివరించారు. ప్రతిరోజూ గోదావరి హారతి నిర్వహించాలని నిర్ణయించామని మంత్రి చెప్పారు. అయితే గత ఐదేళ్లలో గోదావరి హారతిని నిలిపివేశారన్న మంత్రి.. ప్రజల సంస్కృతి, సంప్రదాయాలపై కూడా వైకాపా ప్రభుత్వం దాడి చేసిందన్నారు.

# ఉద్దేశ పూర్వకంగానే ఎంఎన్సీ మద్యం కంపెనీలను తరిమేశారు: మంత్రి కొల్లు రవీంద్ర

స్వార్థ ప్రయోజనాల కోసం గత ప్రభుత్వం మద్యం విధానాన్ని మార్చేసిందని మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు.



అమరావతి, నవంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్): స్వార్థ ప్రయోజనాల కోసం గత ప్రభుత్వం మద్యం విధానాన్ని మార్చేసిందని మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగా ఎంఎన్సీ మద్యం కంపెనీలను రాష్ట్రం నుంచి తరిమేసిందన్నారు. అసెంబ్లీలో నూతన మద్యం విధానంపై చర్చలో భాగంగా మంత్రి మాట్లాడుతూ.. వైకాపా విధానాలపై విమర్శలు గుప్పించారు. "నాసిరకం మద్యం తాగి అనేకమంది అనారోగ్యం పాలయ్యారు. నాసిరకం మద్యంతో కిడ్నీ, కాలేయం సంబంధిత జబ్బులు పెరిగాయి. మద్యం తయారు చేసే 26 కొత్త కంపెనీలు తీసుకొచ్చారు. మద్యం విషయంలో వైకాపా పాలకులు వ్యవస్థీకృత దోపిడీ చేశారు. ఆన్లైన్ పేమెంట్స్ లేకుండా వ్యవస్థను నాశనం చేశారు. పరిపాలన చేతకాక ఆఖరికి బాండ్లు కూడా తాకట్టు పెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతన మద్యం విధానాన్ని తీసుకొచ్చాం. ఆరు రాష్ట్రాల్లో అధ్యయనం చేసి మద్యం పాలసీ తెచ్చాం. మేం వచ్చాక మద్యం విషయంలో పారదర్శకంగా పని చేశాం. దుకాణాల దరఖాస్తు ఫీజు కిందే రూ.1,800 కోట్లు వచ్చింది. 12 ప్రీమియం మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని సబ్కమిటీ సిఫార్సు చేసింది. రూ.99కే నాణ్యమైన మద్యం ఇస్తున్నాం. పలు చోట్లు డీఅడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం" అని కొల్లు రవీంద్ర తెలిపారు.

# పట్నం నరేందర్ రెడ్డిని ఎందుకలా అరెస్టు చేశారు?: హైకోర్టు

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అరెస్టు విధానాన్ని తెలంగాణ హైకోర్టు తప్పుపట్టింది.

హైదరాబాద్, నవంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్): కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అరెస్టు విధానాన్ని తెలంగాణ హైకోర్టు తప్పుపట్టింది. కేబీఆర్ పార్కు వద్ద వాకింగ్కు వెళ్లినప్పుడు ఎందుకు అరెస్టు చేశారని ప్రశ్నించింది. మాజీ ఎమ్మెల్యేను ఓ ఉగ్రవాదిలాగా ఎందుకు అరెస్టు చేయాల్సి వచ్చిందని నిలదీసింది. నరేందర్రెడ్డి పరారీలో ఉన్నారా అని పీపీని ప్రశ్నించింది. దాడికి గురైన అధికారుల గాయాలపై సరిగ్గా నివేదించలేదని హైకోర్టు పేర్కొంది. తీవ్రగాయాలైనట్లు రిపోర్టు ఇచ్చి.. చిన్న గాయాలైనట్లు రాశారని చెప్పింది. నరేందర్రెడ్డి అరెస్టు విషయంలో సుప్రీంకోర్టు నిబంధనలు పాటించలేదని ఉన్నత న్యాయస్థానం ఆక్షేపించింది. మరోవైపు ప్రజలను రెచ్చగొట్టేలా నరేందర్ రెడ్డి మాట్లాడారని పీపీ తెలిపారు. ఈ దశలో పిటిషన్ను అనుమతిస్తే దర్యాప్తుపై ప్రభావం చూపుతుందన్నారు. రిమాండ్ ఆర్డర్ను క్వాష్ చేయాలన్న నరేందర్రెడ్డి పిటిషన్ ను కొట్టివేయాలని కోరారు. రిమాండ్ ఆర్డర్ క్వాష్ పిటిషన్పై వాదనలు ముగిశాయి. తీర్పును హైకోర్టు రిజర్వు చేసింది. నరేందర్ రెడ్డి పాత్రపై నమోదు చేసిన వాంగ్మూలాలు ఇవ్వాలని పీపీని ఆదేశించింది.



# నంద్యాల జిల్లా చిన్న, వీధి వ్యాపారస్తుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

- చిన్న,వీధి వ్యాపారస్తుల జీవనోపాధికి రక్షణ కల్పించాలి
- పట్టణ వెండింగ్ కమిటీ ఏర్పాటు చేయాలి: గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ




నంద్యాల, నవంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్): జిల్లా చిన్న,వీధి వ్యాపారస్తుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం స్థానిక మధుమణి సమావేశ భవనంలో జరిగిన సమావేశంలో ప్రకటించారు. గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ గుర్రాల రవికృష్ణ,గౌరవ సలహాదారుగా న్యాయవాది వెదుర్ల రామచంద్రరావు, అధ్యక్షులుగా మహబూబ్ బాషా, ప్రధాన కార్యదర్శిగా చిన్న మాతంగి ఉమా మహేష్, కోఆర్డినేటర్స్ గా ఆకుమళ్ళ రమేష్,శివరాం రెడ్డి, ఉపాధ్యక్షులుగా అజీజ్ ఖాన్, మద్దినేని వెంకటరమణ, కోశాధికారిగా ఎస్.ఎ.అలీమ్, సంయుక్త కార్యదర్శులుగా షేక్ ఖాజా హుస్సేన్, పిచ్చిక లోకేష్, మహబూబ్ బాషా (మున్నా), బాణాల వెంకటేశ్వర్లు ఆచారి, కార్యవర్గ సభ్యులుగా శివ ఆచారి, షేక్ పాంషావలి, గద్వాల బ్రహ్మయ్య, నిమ్మకాయల మహబూబ్ బాషా, పోతురాజు సంధ్యారాణి, గఫార్, వెంకటేశ్వర్లు, షేక్ అబ్దుల్, దూదేకుల మస్తాన్,వడ్డే నాగరాజు, టి.వెంకటరమణ, వడ్డే పెద్దయ్య ఎన్నుకోబడ్డారు.ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, అధ్యక్షులు మహబూబ్ బాషా, ప్రధాన కార్యదర్శి మాతంగి చిన్న ఉమా మహేష్ మాట్లాడుతూ చిన్న,వీధి వ్యాపారస్తుల సంక్షేమం కోసం, వారి హక్కులు కాపాడడం కోసం ఈ సంఘం కృషి చేస్తుందని ప్రకటించారు.2014 కేంద్ర వీధి వ్యాపారస్తుల జీవనోపాధి రక్షణ చట్టం స్ఫూర్తితో పనిచేస్తామని అన్నారు. ఈ చట్టం ప్రకారం ప్రతి పట్టణంలో పురపాలక,ట్రాఫిక్ పోలీస్, ప్రజా ప్రతినిధులు,వీధి వ్యాపారస్తుల ప్రతినిధులతో టౌన్ వెండింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ వెడ్డింగ్ కమిటీ ద్వారా మెప్మా ఆధ్వర్యంలో వీధి వ్యాపారస్తుల సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు.పట్టణ కూడళ్లలో వెండింగ్ జోన్స్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల నిత్యజీవితంలో చిన్న,వీధి వ్యాపారస్తులు ఒక అంతర్భాగం అన్నారు.అదే సమయంలో చిన్న,వీధి వ్యాపారులు ప్రజలకు,ట్రాఫిక్ కు ఇబ్బందులు కలిగించకుండా వ్యాపారాలు చేసుకోవాలని పిలుపునిచ్చారు. వీధి వ్యాపారస్తులు జీవనోపాధి కోల్పోకుండా సహకరిస్తున్న మంత్రి ఎన్.ఎం. డి.ఫరూక్,పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరిలకు సంఘం తరపున ధన్యవాదాలు తెలిపారు.

# కలుషిత నీరు అనే మాట వినపడకుండా చేస్తాం

## :డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

రక్షిత మంచినీరు ప్రతిఒక్కరి హక్కు అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు.



అమరావతి, నవంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్): రక్షిత మంచి నీరు.. ప్రతిఒక్కరి హక్కు అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. జలజీవన్ మిషన్పై శాసనసభలో పశ్నోత్తరాల్లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. ప్రతి ఇంటికి తాగు నీరందిస్తామని భరోసాఇచ్చారు. జలజీవన్ మిషన్ అమలులో ఏపీ దేశానికే తలమానికంగా ఉండేలా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. కలుషిత నీరు అనే మాట వినపడకుండా చేస్తామని.. కిడ్నీ సమస్యలు తగ్గిస్తామని చెప్పారు. చాలా ఆర్వో ప్లాంట్లు పాడైపోయాయని సభ్యులు సభ దృష్టికి తీసుకురాగా, వాటిని పునరుద్ధరిస్తామని పవన్ కల్యాణ్ తెలిపారు.

# ఎస్సీ, ఎస్టీ, పోస్కో చట్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు




నంద్యాల క్రైం, నవంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్): రాష్ట్ర వ్యాప్తంగా ఏపి సిఐడి అడిషనల్ డిజిపి డా.రవిశంకర్ అయ్యనార్ నేత్రత్వంలో బుధవారం జిల్లా పరిధిలోని పాణ్యం మండలం గడివేముల గ్రామం ఏపీ మోడల్ స్కూల్ నందు ,కర్నూల్ సిఐడి రీజినల్ ఆఫీస్ ఆర్.ఓ డిఎస్పీ వాయుద్ భాష, నంద్యాల డిఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, పోస్కో చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, వర్గాలపై అఘాయిత్యాలు, వివక్షను నివారించడానికి రూపొందించబడిన ఎస్సీ, ఎస్టీ, పోస్కో పిఓఏ చట్టంలోని చట్టపరమైన నిబంధనలపై

## అవగాహన పెంచడం

ఎస్సీ, ఎస్టీ, కమ్యూనిటీలకు వారి హక్కులు, చట్టం క్రింద లభించే చట్టపరమైన రక్షణ గురించి తెలియజేయడం. ఈ కమ్యూనిటీలపై అట్రాసిటీ, వివక్ష, హింస కేసులను ఎలా నిర్వహించాలనే దానిపై చట్టాన్ని అమలు చేసే అధికారులకు, ప్రజలకు అవగాహన కల్పించడం, న్యాయపరమైన వనరులు న్యాయం కోరే ప్రక్రియ గురించి వారికి తెలియజేయడం ద్వారా ఎస్సీ, ఎస్టీ వర్గాలను బలోపేతం చేయడం జరుగుతుందని అధికారులు తెలియజేశారు. పాల్గొనేవారికి అవగాహన కల్పించడం లక్ష్యంగా అవగాహన కార్యక్రమం కొనసాగింది. కుల ఆధారిత హింస, వివక్ష, సాంఘిక బహిష్కరణతో సహా ఈ కమ్యూనిటీల సభ్యులపై చేసిన నేరాలకు కఠినమైన జరిమానాలను చట్టం అందిస్తుందని తెలియజేశారు.

## అఘాయిత్యాల నివారణ

అధికారులు అవగాహన, చురుకైన చర్యల ద్వారా వివక్ష, హింసను ఎలా నిరోధించాలనే దానిపై వివరణాత్మక సందేశం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం నందు జిల్లా అధికారులు పోలీస్ అధికారులు ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు హాజరై ఎస్సీ, ఎస్టీ, చట్టాల పై ప్రసంగించి, ఏదైనా అనుకునే సంఘటన జరిగినప్పుడు చట్ట ప్రకారం ఎలా రక్షణ పొందాలి అని విద్యార్థులకు, ప్రజలకు చట్టాల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి చింతామణి , ఎంపిడిఓ వాసుదేవ గుప్తా, తాసిల్దార్ వెంకటరమణ, సిఐడి ఇన్స్పెక్టర్ శ్రీధర్, పాణ్యం ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, గడివేముల సబ్ ఇన్స్పెక్టర్ నాగార్జున రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శైలజ, ప్రజలు ఏపి మోడల్ స్కూల్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా అవగాహన




నంద్యాల క్రైం, నవంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్): రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా నంద్యాల జిల్లాలో "సేఫ్ ఇండియా" కార్యక్రమం సందర్భంగా, నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు, ట్రాఫిక్ సీఐ బి. మల్లికార్జున గుప్తా ఆధ్వర్యంలో బుధవారం రామనాథ రెడ్డి నగర్ ఉన్న శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యం సహకారంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం ప్రధాన నినాదంగా " రహదారి భద్రత కోసం యునైటెడ్: కమ్యూనిటీ ప్రాధాన్యత ఎంచుకున్నారు. ఈ కార్యక్రమంలో, ట్రాఫిక్ సీఐ బి. మల్లికార్జున గుప్తా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, సీట్ బెల్ట్ ఉపయోగించకపోవడం, మొబైల్ ఫోన్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయని వివరించారు. వారు వారి తల్లితండ్రులకు, ప్రజలకు తెలియచెయ్యవలసిన బాద్యత అని వారికి వివరించడము జరిగినది.

## విద్యార్థుల పాత్ర

విద్యార్థులు ఈ అంశాలను సులభంగా గ్రహిస్తారు. తమ తల్లిదండ్రులకు కూడా చేరుస్తారన్న నమ్మకంతో, వారి వద్దకు ప్రతి నియమాన్ని స్పష్టంగా వివరిస్తూ, రోడ్డు భద్రతకు సంబంధించిన ప్రధాన అంశాలను చర్చించారు.

## ర్యాలీ నిర్వహణ

అవగాహన కార్యక్రమం అనంతరం, సుమారు 250 మంది విద్యార్థులతో స్కూల్ నుండి పద్మావతి నగర - శ్రీనివాస సెంటర్ వరకు ర్యాలీ చేసి మానవహారము నిర్వహించారు. ర్యాలీ సమయంలో విద్యార్థులు రోడ్డు భద్రతకు సంబంధించిన నినాదాలు చేసారు, ప్రజల దృష్టిని ఆకర్షించారు. ఈ ర్యాలీ ద్వారా స్థానిక ప్రజలకు రోడ్డు భద్రతా నియమాల ప్రాముఖ్యత తెలియజేయడం జరిగింది.



## ప్రజలకు పూలతో సందేశం

ర్యాలీ ముగింపు సమయంలో విద్యార్థులు వాహనదారులకు రోజాపూలు అందించారు. ఈ సందర్భంగా, హెల్మెట్ ధరించడం, వేగం నియంత్రణ, డ్రైవింగ్ లైసెన్స్ అనుసరించడం, సురక్షిత డ్రైవింగ్ అవసరం గురించి ప్రజలకు వివరించారు.

## ముగింపు

ఈ కార్యక్రమం రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో, సమాజంలో చైతన్యం పెంచడంలో విజయవంతమైన ప్రయత్నంగా నిలిచింది. నంద్యాల పట్టణ ప్రజలు ఈ కార్యక్రమానికి మంచి స్పందన ఇవ్వడమే కాకుండా, రోడ్డు భద్రత నియమాలను పాటించేలా ప్రేరణ పొందారు. ఈ కార్యక్రమము నందు నంద్యాల ట్రాఫిక్ సిబ్బంది, చైతన్య స్కూల్ సిబ్బంది ఏ.జి ఏం జి. సురేశ్, ప్రిన్సిపల్ విజయ లక్ష్మి , వైస్ ప్రిన్సిపల్ బి రాధ, డీన్ దస్తాగిరి, ప్రైమరీ ఇన్చార్జ్ సరిత, ఇతర సిబ్బంది పాల్గొని కార్య క్రమము విజయవంతము చేయడము జరిగినది.

# రామ్ పోతినేని సరసన భాగ్యశ్రీ బోర్సే..



**మహేశ్ దర్శకత్వంలో రామ్ పోతినేని నటించనున్న సినిమాలో హీరోయిన్గా భాగ్యశ్రీ బోర్సేను ఎంపిక చేశారు.**



'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి దర్శకుడు మహేశ్ దర్శకత్వంలో యంగ్ హీరో రామ్ పోతినేని ఓ సినిమా చేయనున్న విషయం తెలిసిందే. రాపో22 పేరుతో ఇది ప్రచారంలో ఉంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ అప్డేట్ను నిర్మాణసంస్థ వెల్లడించింది. ఇందులో హీరోయిన్గా భాగ్యశ్రీ బోర్సేను ఎంపిక చేసినట్లు పోస్ట్ పెట్టింది. రీసెంట్ సెన్సేషన్ భాగ్యశ్రీ ఈ ప్రాజెక్ట్ లో జాయిన్ కావడంతో ఈ సినిమాకు మరింత అందం వచ్చింది అని పేర్కొంది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను రేపు వెల్లడించనున్నారు. రేపు పూజా కార్యక్రమంతో దీన్ని ప్రారంభించనున్నారు. రామ్ 22వ సినిమాగా రానున్న దీని రెగ్యులర్ షూటింగ్ను త్వరలోనే ప్రారంభించనున్నారు. హై ఎనర్జీతో న్యూ ఏజ్ స్టోరీగా ఇది రానుంది. మైత్రీ మూవీస్పై నవీన్ యెర్నేని, రవిశంకర్లు దీన్ని నిర్మిస్తున్నారు. చివరిసారి రామ్ 'డబుల్ ఇస్మార్ట్' లో కనిపించారు. ఇక భాగ్యశ్రీ బోర్సే తాజాగా రవితేజ సరసన 'మిస్టర్ బచ్చన్'లో కనిపించి తన డ్యాన్స్తో ఆకట్టుకున్నారు. ఇప్పుడు రామ్ సరసన ఓకే కావడంతో వీరి జంట బాగుంటుందని అభిమానులు అనుకుంటున్నారు.

## థియేటర్ల ప్రాంగణంలోకి వారికి నో ఎంట్రీ..: కోలీవుడ్ నిర్మాతల మండలి కీలక నిర్ణయం




యూట్యూబ్ ఛానల్స్, కొంతమంది నెటిజన్లు ఇచ్చే రివ్యూలు సినిమా ఫలితంపై ప్రభావం చూపుతున్నాయని తమిళ్ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ పేర్కొంది. దానిని నియంత్రించేందుకు తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. ఈమేరకు ఎక్స్ వేదికగా బుధవారం పోస్ట్ పెట్టింది. "ఈ ఏడాది విడుదలైన చాలా చిత్రాలపై రివ్యూలు ప్రభావం చూపించాయి. ముఖ్యంగా 'ఇండియన్ 2', 'వేట్టయన్', 'కంగువా' ఫలితాలపై పబ్లిక్ టాక్, యూట్యూబ్ ఛానల్స్ ఇచ్చే విశ్లేషణలు ఎంతో ఎఫెక్ట్ చూపింది. రానురాను చిత్ర పరిశ్రమకు ఇదొక సమస్యగా మారుతోంది. దీనిని కట్టడి చేసేందుకు పరిశ్రమలోని అన్ని సంఘాలు ఏకం కావాలి. పరిశ్రమ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి. ఇందులో భాగంగా థియేటర్ యజమానులు యూట్యూబ్ ఛానల్స్ను సినిమా హాళ్ల ప్రాంగణంలోకి అనుమతించకూడదు. ఫస్ట్ డే.. ఫస్ట్ షో సమయంలో థియేటర్ వద్ద పబ్లిక్ రివ్యూలకు అవకాశం కల్పించకూడదు. అలాగే, రివ్యూల పేరుతో నటీనటులు, దర్శక నిర్మాతలపై వ్యక్తిగత విమర్శలను మేము ఖండిస్తున్నాం. ఇకపై అలాంటివాటికి పాల్పడితే అంగీకరించేది లేదు" అని పేర్కొంది. కమల్హాసన్ నటించిన 'ఇండియన్ 2' విడుదలైన నాటినుంచే నెగిటివ్ రివ్యూలు వచ్చిన విషయంతెలిసిందే. సినిమాలోని నటీనటులు, దర్శకుడిని విమర్శలు చేశారు. మరోవైపు, ఇటీవల విడుదలైన 'కంగువా'కూ ఇదే పరిస్థితి నెలకొంది. సూర్య యాక్టింగ్ బాగుందని మెచ్చుకున్నప్పటికీ.. సినిమాని మాత్రం తీవ్రంగా విమర్శించారు. కథ బాలేదని అన్నారు. సౌండ్ విషయంలోనూ కామెంట్స్ వచ్చాయి. వీటిపై నటి జ్యోతిక స్పందించారు. "కంగువా చిత్రానికి వస్తోన్న నెగిటివ్ రివ్యూలు చూసి ఆశ్చర్యపోయా. గతంలో విడుదలైన భారీ బడ్జెట్ చిత్రాల్లో మహిళలను తక్కువ చేసేలా డైలాగ్స్ ఉన్నా, సన్నివేశాలు బాగోలేకపోయినా ఇలాంటి రివ్యూలు చూడలేదు. ఇందులో ఎన్నో పాజిటివ్స్ ఉన్నప్పటికీ దానిని ఎవరూ గుర్తించలేదు. నాకు తెలిసి రివ్యూ చేసే సమయంలో పాజిటివ్స్ మరిచిపోయినట్లు ఉన్నారు. విడుదలైన తొలిరోజు నుంచే ఇంత నెగిటివిటీని చూడటం బాధగా ఉంది. అద్భుతమైన దృశ్యాన్ని రూపొందించడానికి బృందం ఎంచుకున్న కాన్సెప్ట్, ప్రయత్నానికి తప్పకుండా ప్రశంసలు దక్కాలి" అని ఆమె వ్యాఖ్యలు చేశారు. ఆమె పోస్ట్కు పలువురు నటీనటుల నుంచి మద్దతు లభించింది. రివ్యూల కారణంగా సినిమా ఫలితం కొన్నిసార్లు దెబ్బతింటున్నమాట వాస్తవమేనని అన్నారు.


## చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1956:** ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం
- **1750:** మైసూరు రాజు టిప్పు సుల్తాన్ జననం (మ.1799).
- **1910:** సోవియట్ యూనియన్ (రష్యా)కు చెందిన ప్రముఖ రచయిత లియో టాల్స్టాయ్ మరణం (జ.1828).
- **1923:** భారత దేశపు వాణిజ్య బ్యాంకులలో ముఖ్యమైనదైన ఆంధ్రా బ్యాంకు ప్రారంభం.
- **1925:** ఐ.ఐ.టి. రామయ్యగా అందరికీ సుపరిచితుడైన చుక్కా రామయ్య జననం. (చిత్రంలో)
- **1930:** 14వ లోక్సభకు ఎన్నికైన పార్లమెంటు సభ్యుడు కొండపల్లి పైడితల్లి నాయుడు జననం (మ.2006).
- **1956:** తెలుగు సినిమా దర్శకుడు, రచయిత వంశీ జననం.
- **1981:** భారతదేశ ఉపగ్రహం భాస్కర-2 ప్రయోగించబడింది.



బాలల హక్కుల దినోత్సవం


టిప్పు సుల్తాన్


లియో టాల్స్టాయ్


ఆంధ్రా బ్యాంకు ప్రారంభం


చుక్కా రామయ్య


కొండపల్లి పైడితల్లి నాయుడు


దర్శకుడు, రచయిత వంశీ


ఉపగ్రహం భాస్కర-2


## షారుక్ ఖాన్ తనయుడి ఎంట్రీపై కంగనా రనౌత్ ప్రశంసలు

**బాలీవుడ్ స్టార్ హీరో షారుక్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ రైటర్, దర్శకుడిగా ఎంట్రీ ఇస్తోన్న విషయం తెలిసిందే. దీనిపై నటి కంగనా రనౌత్ స్పందించారు. ఆర్యన్ ఖాన్ నిర్ణయాన్ని మెచ్చుకున్నారు.**



బాలీవుడ్ స్టార్ హీరో షారుక్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ రైటర్, దర్శకుడిగా ఎంట్రీ ఇస్తోన్న విషయం తెలిసిందే. దీనిపై నటి కంగనా రనౌత్ స్పందించారు. ఆర్యన్ ఖాన్ నిర్ణయాన్ని మెచ్చుకున్నారు. మిగిలిన స్టార్ కిడ్స్ నటనలోకి అడుగుపెట్టకుండా.. కెమెరా వెనక నిలబడి మెగాఫోన్ పట్టుకోవడం ప్రశంసించాల్సిన విషయం అన్నారు. "సినిమా కుటుంబాలకు చెందిన పిల్లలు మేకప్ వేసుకోవడం, బరువు తగ్గడం, తమని తాము గాజుబొమ్మల్లా భావించడం.. నటీనటులుగా మారడం సాధారణంగా చూస్తుంటాం. దానిని మించి వెళ్లాలనుకోవడం నిజంగా గొప్ప విషయం. భారతీయ చిత్ర పరిశ్రమ స్థాయిని పెంచడం కోసం సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఇప్పుడెంతో ఉంది. స్టార్ కుటుంబాలకు చెందినవారు సులభమైన మార్గాన్ని ఎంచుకొని నటనలోకి వస్తుంటారు. అలాకాకుండా, కెమెరా వెనక నిలబడటానికి మనకెంతో మంది కావాలి. తక్కువమంది మాత్రమే ఆసక్తి కనబరిచే మార్గాన్ని ఆర్యన్ ఎంచుకున్నారు. రైటర్, దర్శకుడిగా అతడి తొలి ప్రాజెక్ట్ కోసం ఎదురుచూస్తున్నా" అని పేర్కొన్నారు. ఆర్యన్ ఎంట్రీకి సంబంధించి ఎంతోకాలం నుంచి వార్తలు వస్తున్నాయి. దీనిపై షారుక్ కూడా పలు సందర్భాల్లో స్పందించారు. ఆర్యన్కు రైటింగ్పై ఎంతో ఆసక్తి ఉందని చెప్పారు. తన కుమారుడు రాసిన కథలను తాను అప్పుడప్పుడూ చదువుతుంటానని అన్నారు. ఈనేపథ్యంలోనే మంగళవారం ప్రముఖ ఓటీటీ సంస్థ నెటిక్స్ ఆర్యన్ తొలి ప్రాజెక్ట్ గురించి అనౌన్స్ చేసింది. "బాలీవుడ్లో ఇప్పటివరకూ చూడని సరికొత్త వెబ్సిరీస్ను మీకు అందించబోతున్నాం. 2025లో ఈ సిరీస్ విడుదలవుతుంది" అని తెలిపింది. 'నెటిక్స్', 'రెడ్ చిల్లీస్ ఎంటర్టైన్మెంట్ సంస్థలు సంయుక్తంగా ఈ వెబ్సిరీస్ను రూపొందించనున్నాయి. తనయుడి ఎంట్రీపై షారుక్ కూడా ఆనందం వ్యక్తంచేస్తూ పోస్ట్ పెట్టారు. నెట్ ఫిక్స్ టీమ్తో కలిసి వర్క్ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆర్యన్ రాసిన ఉద్వేగభరితమైన కథ తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుందన్నారు. బాలీవుడ్ నటీమణులు అలియాభట్, అనన్యపాండే, తదితరులు ఆల్ ది బెస్ట్ చెప్పారు. చిత్ర పరిశ్రమ నేపథ్యంగా ఈ సిరీస్ని రూపొందిస్తున్నట్టు తెలుస్తోంది. సినీ నేపథ్యం లేని వ్యక్తి ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడం వంటి విషయాలను ఇందులో చూపించనున్నారని టాక్. దీనికి 'స్టార్ డమ్' అనే టైటిల్ ప్రచారంలో ఉంది.

## మాట మాత్రం చెప్పకుండా ఆ దర్శకుడు క్లైమాక్స్ మార్చేశాడు: 'బద్రి' నటి



'బద్రి'తో తెలుగు ప్రేక్షకులకు చేరువైన బాలీవుడ్ నటి అమీషా పటేల్. ఆమె ఇటీవల 'గదర్ 2'తో విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఆ చిత్ర దర్శకుడు అనిల్ శర్మను ఉద్దేశించి తాజాగా ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. తనకు మాట మాత్రం చెప్పకుండా ఆయన సినిమా క్లైమాక్స్ మార్చేశారని చెప్పారు. "2001లో విడుదలైన 'గదర్' భారీ విజయాన్ని అందుకుంది. దీనికి సీక్వెల్గా వచ్చిన 'గదర్ 2' పై ప్రేక్షకులకు ఎన్నో అంచనాలు ఏర్పడ్డాయి. ఈక్రమంలోనే దర్శకుడు అనిల్ శర్మ క్లైమాక్స్ను అద్భుతంగా ప్లాన్ చేశారు. మొదట ప్రతి నాయకుడి పాత్రను సకీనానే (అమీషా పటేల్ పాత్ర పేరు) చంపాలని ఆయన తెలిపారు. అది నాకెంతో నచ్చింది. నిర్మాత కూడా దానికి అంగీకరించారు. కాని, షూట్కు వచ్చేసరికి అనిల్ సీన్ మార్చేశారు. ప్రతినాయకుడి పాత్రను చరణ్ జీత్ (అనిల్ శర్మ తనయుడు ఉత్కర్ష్ శర్మ పాత్ర పేరు) చంపేలా సీన్స్ క్రియేట్ చేశారు. షూట్ జరిగేవరకూ ఆ విషయం నాక్కూడా తెలియదు. అయినప్పటికీ ఆయన అంటే నాకెంతో గౌరవం. ఆయన చేసిన పనికి ఇప్పుడు బాధపడుతుంటారు. ఏది ఏమైనా మా సినిమా బాక్సాఫీస్ వద్ద విజయాన్ని అందుకున్నందుకు ఆనందంగా ఉంది" అని అమీషా పటేల్ తెలిపారు. 'గదర్ ఏక్ ప్రేమ్కథ'కు సీక్వెల్గా 'గదర్ 2' తెరకెక్కింది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ఇది రూపుదిద్దుకుంది. సన్నీడియోల్, అమీషా పటేల్ ప్రధాన పాత్రలు పోషించారు. గతేడాది విడుదలై ఘన విజయాన్ని అందుకుంది. సన్నీదేవోల్, అమీషా యాక్టింగ్ను సినీప్రియులు మెచ్చుకున్నారు. రూ.60 కోట్లతో ఈ చిత్రాన్ని నిర్మించగా.. రూ.600 కోట్లకు పైగా వసూలుచేసినట్లు సినీ విశ్లేషకులు అంచనా వేశారు. 'గదర్ 3' కూడా ఉండే అవకాశం ఉందని చిత్రబృందం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. 'బద్రి'లో సరయు పాత్రలో నటించిన అమీషా పటేల్ తెలుగువారికి సుపరిచితురాలు. 'నాని', 'నరసింహుడు', 'పరమవీరచక్ర వంటి తెలుగు చిత్రాల్లోను యాక్ట్ చేశారు.



# ఆసీస్లో తొలి టెస్టు.. కెప్టెన్ బుమ్రా సర్ప్రైజ్ ఫైనల్ 11 ఇదేనా?

**కెప్టెన్గా వ్యవహరించనున్న జస్ప్రీత్ బుమ్రా తన తుది జట్టు ఎంపిక విషయంలోనూ ప్రత్యేకత చూపించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.**

బోర్డర్- గావస్కర్ ట్రోఫీలో రెండు రోజుల్లో ఆస్ట్రేలియాతో భారత్ తొలి టెస్టు ఆడనుంది. రోహిత్ శర్మ గైర్హాజరీలో కెప్టెన్గా జస్ప్రీత్ బుమ్రా జట్టును నడిపించనున్నాడు. తుది జట్టు ఎంపికపై తనదైన ప్రభావం చూపించేందుకు ప్రయత్నిస్తున్నట్లు క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. పెర్త్ పేస్కు అత్యంత అనుకూలంగా ఉండే పిచ్. ఇలాంటి దానిపై కనీసం నలుగురు పేసర్లు ఉండాలని ఏ కెప్టెనైనా కోరుకుంటాడు. ఒక్క స్పిన్నర్ను బరిలోకి దింపేందుకు చూస్తాడు. అతడు కూడా బ్యాటింగ్ చేయగలిగి ఉండాలి. ఇప్పుడు స్క్వాడ్లో ముగ్గురు స్పిన్ ఆల్రౌండర్లు, ఒక పేస్ ఆల్రౌండర్ ఉన్నాడు. మరి ఎవరికి అవకాశం వస్తుందనేది ఆసక్తికరంగా మారింది. అయితే, బుమ్రా మాత్రం తన తుది జట్టుపై ఇప్పటికే ఓ అంచనాకు వచ్చేసినట్లు క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి.



### నితీశ్ అరంగేట్రం.. మిడిలార్డర్ సర్ఫరాజ్!

తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి అరంగేట్రం దాదాపు ఖాయమనే చెప్పాలి. పేస్ ఆల్రౌండర్గా అతడికి స్థానం దక్కనుంది. ఆస్ట్రేలియా ఏతోపాటు ఇంట్రాస్క్వాడ్ వార్మప్ మ్యాచ్లో నితీశ్ మెరుగైన ప్రదర్శన చేసినట్లు మేనేజ్మెంట్ గమనించింది. దీంతో అతడికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. లోయర్ ఆర్డర్ లో బ్యాటింగ్ చేసే సత్తా కలిగిఉండటమూ నితీశు కలిసొచ్చే అంశమని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. యశ్ దయాళ్, హర్షిత్ రాణాకు ఇప్పుడే ఛాన్స్ రాకపోవచ్చు. పేస్ భారాన్ని కెప్టెన్ బుమ్రాతోపాటు ఆకాశ్ దీప్, సిరాజ్ పంచుకోనున్నారు. లోతైన బ్యాటింగ్ తోపాటు ఫాస్ట్ బౌలింగ్ బలంగా ఉండేలా మేనేజ్మెంట్ చూస్తోంది.

### -అశ్విన్కే ఓటు..

విదేశాల్లో స్పిన్నర్ను తీసుకోవాలంటే తొలుత బ్యాటింగ్ కూడా చేయగలిగే రవీంద్ర జడేజా వైపే మేనేజ్మెంట్ మొగ్గు చూపేది. కానీ, ఆసీస్పై అద్భుతమైన రికార్డు కలిగిన రవిచంద్రన్ అశ్విన్ను ఈసారి ఏకైక స్పిన్నర్గా తీసుకోవాలనే ఉద్దేశంలో బుమ్రా ఉన్నాడని తెలుస్తోంది. దీంతో జడేజాతోపాటు వాషింగ్టన్ సుందర్కు చుక్కెదురైనట్లే. బౌన్సీ పిల్లపై అశ్విన్ మరింత ప్రమాదకరంగా మారతాడనే అంచనాతో కెప్టెన్ ఈ నిర్ణయానికొచ్చినట్లు సమాచారం.

### ఓపెనర్గా కేఎల్..?

రోహిత్ శర్మ లేకపోవడంతో యశస్వి జైస్వాల్తో కలిసి ఓపెనర్గా కేఎల్ రాహుల్ రావడం ఖాయమని తెలుస్తోంది. సీనియార్టీకి ప్రాధాన్యం ఇవ్వడంతో అభిమన్యుకు అవకాశం దక్కకపోవచ్చు. వన్ డౌన్లో గిల్ స్థానంలో సర్ఫరాజ్ను ఆడించే ఛాన్స్ లేకపోలేదు. విరాట్ కోహ్లి ఎలాగూ నాలుగో స్థానంలో వస్తాడు. ధ్రువ్ జురెల్ను స్పెషలిస్ట్ బ్యాటర్గా బరిలోకి దింపుతారని ప్రచారం సాగుతోంది. వీటన్నింటిపై ఓ స్పష్టత రావాలంటే.. మరో రెండు రోజులు వేచి చూడాల్సిందే.



**తుది జట్టు (అంచనా)**

యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సర్ఫరాజ్ ఖాన్, విరాట్ కోహ్లి, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), ధ్రువ్ జురెల్, నితీశ్ కుమార్ రెడ్డి, అశ్విన్, సిరాజ్, ఆకాశ్ దీప్, జస్ప్రీత్ బుమ్రా (కెప్టెన్).

## ఇంటి చిట్కాలు


# నెయ్యిలో వేయించిన వెల్లుల్లి తినడం వల్ల ఎన్నో లాభాలు..

## ముఖ్యంగా మగవారికి..

**వెల్లుల్లిని నెయ్యిలో వేయించి తినడం వల్ల ఎన్నో వ్యాధుల ముప్పు నుంచి తప్పించుకోవచ్చు. ఇది ఓ అద్భుత ఔషధంలా పనిచేస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.**

భారతీయ వంటగదిలో అనేక కూరగాయలు, మసాలాలు ఉంటాయి. ఇవి ఆహారానికి రుచిని ఇవ్వడమే కాకుండా ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి. అలా వంటగదిలో దొరికే రెండింటితో ఎన్నో ఆరోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చు. ఆ రెండు పదార్థాలే వెల్లుల్లి, నెయ్యి. ఈ రెండు ఉండని వంటగది ఉండదనే చెప్పుకోవచ్చు. ఈ రెండు ఆహారపు రుచిని పెంచడమే కాకుండా.. మన ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. వెల్లుల్లిని నెయ్యిలో వేయించి తినడం వల్ల ఎన్నో వ్యాధుల ముప్పు నుంచి తప్పించుకోవచ్చు. ఇది ఓ అద్భుత ఔషధంలా పనిచేస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. నెయ్యిలో వెల్లుల్లిని వేయించి తినడం వల్ల ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయో ఇక్కడ తెలుసుకుందాం.






### నెయ్యితో ఆరోగ్య ప్రయోజనాలు..

నెయ్యితో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. నెయ్యిలో పోషకాలు అధికంగా ఉంటాయి. నెయ్యిలో ఆరోగ్యకరమైన కొవ్వులు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. నెయ్యిలో విటమిన్ ఎ,కె, ఇ, డి, ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఉన్నాయి. చిన్న పిల్లలకు నెయ్యి తినిపిస్తే మంచిదని నిపుణులు చెబుతుంటారు. నెయ్యిని రోజూ తీసుకోవడం వల్ల కంటి ఆరోగ్యం మెరుగవుతుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. నెయ్యి తినడం వల్ల జీర్ణక్రియ మెరుగవుతుంది. అజీర్తి, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయి.

### వెల్లుల్లితో ఆరోగ్య ప్రయోజనాలు..



వెల్లుల్లితో కూడా అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. వెల్లుల్లి తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరగవుతుంది. వెల్లుల్లిలో కొలెస్ట్రాల్ సాయిల్ని తగ్గించే గుణాలు ఉన్నాయి. అధిక బరువుతో బాధపడేవారు వెల్లుల్లి తీసుకోవడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి. బరువు అదుపులో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. నిద్ర లేమి సమస్యలతో బాధపడేవారు వెల్లుల్లిని తీసుకోవడం మంచిది. వెల్లుల్లి తీసుకోవడం వల్ల మంచి నిద్ర వస్తుంది. వెల్లుల్లిలో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ. వెల్లుల్లి తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

### నెయ్యిలో ఎలా వేయించాలి..



వెల్లుల్లిని దేశీ నెయ్యితో తీసుకోవడం అమృతం కంటే తక్కువేం కాదు అని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఇందుకోసం వెల్లుల్లిని పొట్టు తీసి రెబ్బలుగా విడగొట్టుకోవాలి. ఆ తర్వాత నెయ్యిలో వేయించాలి. నెయ్యిలో వేయించిన వెల్లుల్లిని ప్రతి రోజూ ఉదయం తింటే మంచి లాభాలు ఉంటాయని ఆయుర్వేదం చెబుతుంది. నెయ్యిలో వేయించిన తర్వాత.. వెల్లుల్లి టేస్ట్ మారుతుంది. నెయ్యిలో వేయించిన వెల్లుల్లి తినడం వల్ల ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయో ఇక్కడ చుద్దాం.

### పక్షవాతం వచ్చే ప్రమాదం లేదు..



వెల్లుల్లిని నెయ్యిలో వేయించి తింటే బ్రెయిన్ స్ట్రోక్ ముప్పు నుంచి తప్పించుకోవచ్చని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఈ కాంబినేషన్ రక్తపోటు ఉన్నవారికి దివ్యౌషధం. బీపీని నార్మల్గా ఉంచడంలో సాయపడుతుంది. ఇలా తినడం వల్ల మెదడు ఆరోగ్యం మెరగవుతుంది. దీంతో పక్షవాతం వచ్చే ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

### బలమైన రోగనిరోధక శక్తి..




చలికాలంలో చలి గాలులు కారణంగా వ్యాధుల బారిన పడే ప్రమాదముంది. ముఖ్యంగా జలుబు, దగ్గు, గొంతు నొప్పి వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. నెయ్యిలో వేయించిన వెల్లుల్లి రోజూ తినడం వల్ల ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుంది. దీంతో.. వ్యాధుల్ని తట్టుకునే శక్తి వస్తుంది. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, ప్రతిరోజూ దేశీ నెయ్యిలో వేయించిన వెల్లుల్లిని తీసుకోవడం వల్ల ప్రయోజనం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు..

### ఆటో ఇమ్యూన్ వ్యాధులకు చెక్..



వెల్లుల్లిని నెయ్యితో వేయించి తినడం ద్వారా ఆటో ఇమ్యూన్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఆర్థరైటిస్, లూపస్, మల్టిపుల్ స్క్లెరోసిస్ , దీర్ఘకాలిక మంట వంటి ఆటో ఇమ్యూన్ వ్యాధులు వంటి సమస్యలను నివారించవచ్చు.

### శరీరం నుంచి టాక్సిన్స్ బయటకు..



వెల్లుల్లిలో అల్లిసిన్, సపోనిన్ వంటి అనేక క్రియాశీల సమ్మేళనాలు, యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. అలాంటి వెల్లుల్లిని నెయ్యిలో వేయించడం వల్ల మరింత ప్రయోజనాలు చేకూరతాయి. ఈ కాంబినేషన్ శరీరం నుంచి టాక్సిన్స్ (విష పదార్థాలు)ను బయటకు పంపించడంలో సాయపడతాయి.

### మగవారికి మంచిది..



నెయ్యిలో వేయించిన వెల్లుల్లి మగవారి ఆరోగ్యానికి మంచిది. ప్రతి రోజూ తినడం వల్ల టెస్టోస్టెరాన్ స్థాయిలు పెరుగుతాయి. దీంతో శుక్రకణాల సంఖ్య పెరుగుతుంది. పురుషుల్లో లైంగిక ఆరోగ్యం మెరగవుతుంది. ఇక, హై బీపీతో బాధపడే పురుషులకు ఇది సూపర్ ఫుడ్ అని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. గమనిక..ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.